# కళ్లు పచ్చబడ్డాయి



'గత పదేళ్లుగా పది లక్షలు ఫండ్‌లో జమ చేశారు. దాన్ని నేను పది నెలల్లో కోటి రూపాయలకు పడగలెత్తిస్తాను'. బోర్డు మీటింగ్‌లో ఆఫీసర్ మనోజ్ సవాలు విసిరాడు.

చైర్మన్‌తో సహా ఆఫీసర్లంతా దిగ్భ్రమచెందారు.

'ఇట్స్ ఇంపాజిబుల్'

'నాకొక అవకాశం ఇవ్వండి, నా పనికి అడ్డురాకుండా వుంటే చాలు' మనోజ్ మరింత ఉత్సాహంగా పలికాడు.

అదొక పేరుమోసిన సంస్థ. అందులో ఒక ప్రత్యేక విభాగంలో కనీసం ఓ రెండు వందలమంది కార్మికులు పనిచేస్తున్నారు.

మనోజ్ విసిరిన సవాల్‌కు చైర్మన్ వత్తాసు పలికాడు. అదిచూసి, అతడేదో ప్రొడక్షన్ పెంచి కార్మికులను ఉద్ధరిస్తారనుకున్నారు కానీ మనోజ్ అధికారి తన విశ్వరూపాన్ని చూపిస్తూ సంస్థలో వున్న బస్సుల్ని ఏభై లక్షలకి అమ్మేసి, వాటి స్థానంలో అద్దె బస్సులను తిప్పసాగాడు. కార్మికులంతా ఇది అన్యాయమని గొంతెత్తి అరిచి, అసంతృప్తిని వెలిబుచ్చారు.

చైర్మన్‌కి మాత్రమే కారు హోదా కల్పించి, మిగతా కార్లను, వ్యాన్‌లను పాతికలక్షలకు అమ్మేసి ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ ఎరజూపి వారి కోపాన్ని అణిచివేసాడు. వర్కర్స్ మెస్ అద్దెకిచ్చి గుడ్‌విల్ మీద కొంత, వోల్డ్ గూడ్స్ అన్నీ అమ్మేసి ఆఫీస్ స్టాఫ్‌ను తమ సొంత కార్లను వినియోగించుకోమన్నాడు. అలా రకరకాల జిమ్మిక్స్‌తో ధనాన్ని కూడేశాడు.

సంస్కరణల కింద భ్రమింపజేసినందుకు వర్కర్స్ వ్యతిరేకిస్తున్నా, చైర్మన్ మాత్రం ఎప్పుటికప్పుడు మనోజ్‌ని భుజం తట్టి గ్రీన్ సిగ్నల్ ఇస్తూనే వున్నాడు.

పదినెలలు గడవక ముందే మనోజ్ ఛాలెంజ్ చేసినట్లే కోటి రూపాయల ఫండ్ జమచేశాడు.

అందరూ బేష్ అని పొగిడారు కానీ మనోజ్‌కి ఎదురుదెబ్బ తగిలింది. ఛైర్మన్ అదనుచూసి మనోజ్‌ని మరోచోటకు బదిలీ చేసి ఆ స్థానంలో వినోద్ అనే అధికారిని తెచ్చిపెట్టుకున్నాడు. వినోద్ పదవిలో చేరిన రోజునే మనోజ్ ప్రతాపం గురించి అంతా విన్నాడు. వెంటనే తన పంథా మార్చుకున్నాడు. అతని దృష్టి కోటి రూపాయల ఫండ్ మీదకు మళ్లింది. ఛైర్మన్‌తో రహస్య మంతనాలు జరిపాడు.

సంస్థ ఔన్నత్యానికి పాటుపడుతున్నట్లే కనిపిస్తూ ధనదాహం తీర్చుకోవాలనుకున్నారు. వర్కుషాపు, ఆఫీసు బిల్డింగ్ పూర్తిగా రూపురేఖలు మార్చడానికి ప్లాన్ వేశాడు. కాంట్రాక్టర్‌తో టెండర్ వేయించాడు. పదిలక్షలు అటు ఛైర్మన్‌కి, అధికారికి, వినోద్‌కి ముట్టింది. మరో అడుగు ముందుకేస్తూ అద్దె బస్సుల్ని తీసేస్తూ కొత్తవికొంటూ మరో పదిక్షలు వెనకేశాడు. ఎయిర్ కండెషనర్స్,డెకరేషన్స్‌కి, గార్డెనింగ్‌కి, ఫౌంటెన్‌కి అన్నింటికి టెండర్లు పిలిచి మరో ఇరవై లక్షలు దారి మళ్లించారు.

అక్రమంగా కోటి రూపాయల ధనాన్ని దూబారా ఖర్చు చేసి వర్కర్స్ సంక్షేమానికి గండికొట్టారని కార్మిక నాయకులంతా మళ్ళీ ధ్వజమెత్తారు. అధికారుల చర్యల్ని బాహాటంగా ఖండించినా ఎవరూ వీసమెత్తు స్పందించలేదు.

ఆ రోజు 'మేడే' ఛైర్మన్ పెద్దఎత్తున కార్మికులతో మీటింగ్ ఏర్పాటు చేశాడు.

"కార్మికులారా ! ఈరోజు 'మేడే' శుభసందర్భాన ఈ వేడుక జరుపుకుంటున్నాం. మన యూనిట్‌ను ఒక మోడల్‌గా తీర్చిదిద్దిన యువ అధికారి వినోద్‌ని ఈ సందర్భంగా సత్కరిస్తున్నాం. వారికి పదివేలు క్యాష్ అవార్డు బహూకరిస్తున్నాం" అని ఛైర్మన్ వినోద్‌ని ఘనంగా సన్మానించాడు.

" ఇది అన్యాయం" అంటూ లీడర్స్ లేచి పిడికిళ్ళు బిగించారు.

అదే సమయంలో కార్మిక నాయకుల్ని ఆహ్వానించి వారిపై మెరుపుదాడి చేశాడు ఛైర్మన్.

"మీ రెప్పుడూ యాజమాన్యంతో సహకరించరు. మేనేజ్‌మెంట్ చర్యలను వ్యతిరేకించడమే మీ ఆనవాయితీ. లేకుంటే ఫండ్‌రైజ్ చేసినప్పుడు మీకేదో అన్యాయం జరిగిపోతుందన్నట్లు ఎదురుతిరిగారు. ఈరోజు అదే ఫండ్‌తో కార్మిక జనోద్ధరణకి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నాం. వాటిని కూడా మీరు ఖండిస్తున్నారు. అభివృద్ధి నిరోధకులుగా సంస్థకు ద్రోహం తలపెడుతున్నారు. కావున మీకు షోకాజ్ నోటీసు జారీ చేస్తున్నాం. మీపై క్రమశిక్షణా చర్య ఎందుకు తీసుకోకూడదో చెప్పండి"అంటూ చైర్మన్ అందరికీ నోటీసులు జారీ చేశాడు.

కార్మిక నాయకులంతా స్తబ్దులై నివ్వెరపోయారు.

వారందరి 'కళ్లు పచ్చుబడ్డాయి'.

(మనభూమి, నవంబర్ 2006)